# విశ్వరూపం

"బావా! నీ అనుమానాలు వొప్పుకుంటాను. యిప్పటికైనా నమ్ముతావా? ఈ మూడు రోజుల్లో నేను మూడు 'రన్నులు' తీసినానా? మూడు 'బ్రాకెట్లూ' వచ్చినాయి. యెట్లా వచ్చినాయంటావ్? యిది 'సైంటిఫిక్ గేమ్' కాబట్టి. నీ ఎం.ఏ., 'మేథమేటిక్స్' బుర్రతో యిప్పుడాలోచించు. నీ అపనమ్మకం లేకపోతే ఈమూడు రోజుల్లో పది పంద్రెండువేలు జేబులో పడేవి, నా మాదిరి. యింత డబ్బు నీ ఇరవై ఎకరాల మెట్టభూమిలో ఎప్పుడు మిగిలిస్తావు, వానలు వానలో అని పైకిజూస్తూ?"

– క్రిష్ణయ్య ఉత్సాహంగా బావమరది పార్థుకు చెప్పుకుపోతూనే వున్నాడు.

పార్థు మనసులో మట్కా అంకెలు గిరగిరా తిరుగుతున్నాయి. చేజారిన వేలాది రూపాయలు కళ్ళముందు మెదలుతున్నాయి.

పెదనాన్న బతికినన్నాళ్ళూ పాడుబడ్డ గుళ్ళల్లో యెక్కడెక్కడ బంగారం వుందోనని అంజనాలు వేయించటం, యే గడ్డపు సన్నాసి వూళ్ళోదిగి, బంగారం చేయగలనన్నా, చేయించే ప్రయత్నాలు చేయటం పార్థుకు జ్ఞాపకం వస్తున్నాయి.

పెదనాన్న స్వర్గయోగానికి ముక్కాలు మువ్వీసం కరిగిపోయిన సమష్టికుటుంబం ఆస్తి స్మృతిలో మెదలుతోంది. 'మంగత్తై'లో లక్షలు చూసి, అప్పులపాలైన చిన్నాన్న జ్ఞాపకం వస్తున్నాడు.

ఏ రకం అలవాట్లూ లేకుండా భూమిని నమ్ముకొని అప్పుల్లో వున్న తండ్రి, యింకా పెళ్ళికాని యిద్దరు చెల్లెళ్ళూ, చదువు వొంటబట్టని తమ్ముడూ, ఉద్యోగం లేక తండ్రికేదో సాయపడుతూ పల్లెటూళ్ళో తను పడుతున్న అవస్థలూ మనసులో...

"పొలం అమ్మిపెట్టిన యిరవై తులాల బంగారం మీ బావ మట్కాలో పోగొట్టినాడ"ని యేడుస్తూ చెల్లెలు ఉత్తరం రాయటం, "మీ బావకు బుద్ధిచెప్పిరా" అని తండ్రి పంపటం, బావ తన కళ్ళముందే మూడు రోజులూ మూడు యాభైలు కట్టి, మూడురోజులూ మూడు ఎనభై యింతలు సంపాదించటం పార్థు బుర్రను కలవరపెడుతున్నాయి.

గత అనుభవాలు, తలయెత్తుతున్న వివేకం, ముంచుకొస్తున్న ఆశా, తనకే తెలీని యేదో భయం—వీటితో పార్థు తలమునక లవుతున్నాడు.

అతని మౌనం చూసి క్రిష్ణయ్య మరింతగా పుంజుకున్నాడు :

"మెడమీద తలకాయ అంటూ వుంటే వేలు సంపాదించవచ్చు. ఇందులో ఏం మోసం వుంది? పైగా కొన్నివేలమంది 'కంపెనీ'ల వాళ్ళకు 'బీటర్ల'కు వుద్యోగం యిచ్చి ఆదుకుంటున్న 'యిండస్ట్రి' యిది."

పార్థు నిట్టూర్చి అన్నాడు :

"పోనీలే! నువ్వు బాగుపడితే చాలు" "యేదో రకంగా" అని చేర్చలేక పోయాడు.

"అమ్మయ్య! గొడవలు యిక వుండవు" అని అనుకుంటూ క్రిష్ణయ్య చొరవగా అన్నాడు.

"మనందరం బాగుపడాలనే నా కోరిక."

పార్థు మౌనంగా వుండిపోయాడు.

ఆ రాత్రి చెల్లెలు తన మెడలో కొత్త నగలు చూపిస్తూ ఆనందంగా అన్న పార్థుతో అంది :

"పొరపాటున జాబు రాసినా, మీ బావ పాత 'ఫ్యాషన్' లెమ్మని తెలిసిన కంసలాయనకిస్తే, యిన్ని రోజులు పెట్టుకొని కొత్తవి చేయించినాడు. నాయనకు చెప్పు. బాగున్నాయి కదా?"

—చెల్లెలు ఆనందాన్ని చూసి పార్థు అనుభవద్వారాలు విచ్చుకున్నాయి.

బావకూ, చెల్లెలుకూ చెప్పి పార్థు వూరు చేరాడు.



కథా నిలయం
3627
శ్రీకాకుళం

"మేనల్లుడని పిల్లనిస్తే కొంపలు తగులబెట్టే నాయాలు అయినాడు. ఇంకనైనా మర్యాదగా వుంటాడా? బంగారం సంగతి చెప్పాడా?" అంటూ యింట్లో అడుగుపెడుతూనే ఎగిరిన తండ్రినిచూస్తూ "మనకంటే బాగానే బతుకుతున్నారు బంగారం ఎక్కడికి పోలేదు" అన్నాడు పార్థు. పార్థు తండ్రికి అంతకంటే ఏమీ పట్టలేదు.

వూళ్ళో-పార్థు తాడిపర్తినుంచి రహస్యంగా తెచ్చుకున్న మట్కా 'చార్టు'ను తీశాడు. కొన్ని రోజులపాటు కూడికలు గీశాడు. మూలమూలలా వెతికాడు. దినవారక్రమాలు పరీక్షించాడు. 'వోపెనింగ్', 'క్లోజ్', 'బ్రాకెట్టూ', ఆయా నంబర్లూ, 'రన్ను'ల, 'ఆపోజిట్లూ' యెట్లా వస్తాయో ఆలోచించాడు. తన ఎం.ఏ. లెక్కల విజ్ఞానం వుద్యోగానికి పనికిరాకపోయినా, తనకీవిధంగా సాయపడుతూవున్నందుకు వొకరకంగా మురిసిపోయేవాడు. మట్కా గణితవిజ్ఞానమే అని నమ్మాడు.

ఈ అధ్యయనాన్ని గుర్తించి హెచ్చరించినవాడు ఆ వూళ్ళో వొక్కడే. పార్థులాగే నిరుద్యోగంలో యెప్పుడూ యేవో పుస్తకాలు చదువుకునే పార్థు స్నేహితుడు చెన్నకేశవులు. అయితే పెట్టుబడిదారి విధానంలో..." అంటూ ఒకగంట సాగిన చెన్నకేశవులు వుపన్యాసం పార్థుకు ఒక్క ముక్కా అర్థంకాలేదు. యూనివర్శిటీలోనూ పీడి సోది ఇలాగే సాగేది; రూమ్మేటుకూడా అయినందుకు రెండేండ్లు అనుభవించింది చాలు అనుకున్నాడు. అతనితో యెక్కువగా కలవటం మానివేశాడు. పార్థు జిజ్ఞాస అనుభవందాకా ఆగేదికాదు.

కానీ పార్థుకు తన వూళ్ళో వొక చిక్కు యెదురయింది. తమ మారుమూల పల్లెటూరు నుంచి మట్కా కేంద్రం సింహాద్రిపురానికి కాలినడకన నాలుగు మైళ్ళు వెళ్ళి బస్సెక్కి యేడెనిమిది మైళ్ళు వెళ్ళాలి. తనికేమీ తెలియనట్లు నటించి వూళ్ళో విచారిస్తే ప్రతిరోజూ 'బీటరు' వచ్చి సింహాద్రిపురానికి నెంబర్లు తీసుక వెళతాడని తెలిసినప్పుడు, ఈ రోజో రేపో చావబోయే ముసలమ్మలు సైతం తమ కొంగుల్లోదీ, అడపాల్లోదీ తీసి నంబర్లు చెప్పడం విన్నప్పుడు పార్థు విస్తుపోయాడు. కులాసాకు అన్నట్లు పావలా, అర్థరూపాయా తన స్నేహితుల చేతికి కట్టమని ఇస్తూ వందా, రెండువందలూ సంపాదించాడు. త్వరలోనే వూళ్ళో కుర్రకారుకు పార్థు మట్కా గురువయ్యాడు. అయితే పార్థుకు ఈ వ్యవహారంలో అసంతృప్తి కనిపించలేదు. వూళ్ళోవుండగా పెద్దమొత్తాలు ఆడటానికి పార్థుకు ఇంకుగా వుంది. అడపాదడపా కొన్ని రన్నులు ఫలితాలు ఇవ్వటం లేదు. ఫలితాలు అందినతర్వాత చూస్తే వచ్చిన బ్రాకెట్టుకు మరే మూలో కారణం దొరుకుతోంది. ఈ అపవాద సూత్రం పార్థుకు ఒక పెద్ద సమస్యగా మారి పీడించసాగింది. ఈ లోపలే క్రిష్ణయ్య బావ మట్కాలో నలభైవేలు సంపాదించినట్లు వూరికెవరో వార్త మోసుకొని వచ్చారు.

"వాడెట్లయినా ప్రయోజకుడే" అంటూ సూదులచూపులతో తండ్రి తనను చూస్తూ అన్నప్పుడు, పార్థ అవమానంతో కుచించుకుపోయి 'తగిన సమయం రాక పోతుందా' అనుకున్నాడు.

ఆ సమయంలోనే పార్థకు యేదో పెళ్ళికోసం తాడిపత్రికి వెళ్ళేపని పడింది.

పచ్చపచ్చగా వెరిగిపోతూ వున్న బావనుచూసి, పార్థ వుత్సాహంగా బావను పొగిడాడు:

"బావా! నువ్వన్నట్లు ఇది 'సైంటిఫిక్ గేమే'. అయితే 'ష్యూర్' నెంబర్లను కుంటే, కొన్ని తప్పుతున్నాయి. వచ్చినవి యెందుకొచ్చినాయో 'చార్టులో' దొరుకు తున్నాయి. యెట్లా?"

క్రిష్ణయ్య మొదట అడిగిన ప్రశ్న "యేమాత్రం?" అని,

"ఏంలేదు. 'మేథమేటిక్స్'లో 'ఇంటరెస్టుకొద్దీ స్టడీ' చేస్తున్నా."

"నిజం చెప్పు."

"యెక్కడిది? నీ మాదిరి కాదులే."

"యెంత?"

"రెండు వందలదాకా వచ్చింది. అయితే ముందుచెప్పినానే ఆ గొడవలతోనే..."

"అదా?" అంటూ క్రిష్ణయ్య చిద్విలాసంగా నవ్వి బోధచేశాడు:

"ప్రతి శాస్త్రంలోనూ అపవాదాలున్నాయి. అసలు అపవాదాలు లేని శాస్త్రం శాస్త్రమేకాదు. ఈ అపవాద సూత్రాలను పరిష్కరించగలిగేది కొంత మంది మానవులకుండే అతీతశక్తులు మాత్రమే. కావాలంటే ప్రత్యక్షంగా నువ్వే చూస్తావుగానీ పద..."

కుతుహలంతో, ఆశ్చర్యంతో పార్థ, క్రిష్ణయ్యను అనుసరించాడు. వాళ్ళిద్దరూ పెన్న దక్షిణం ఒడ్డునవున్న బుగ్గరామలింగేశ్వరస్వామి గుడిదాటి, ఆ పక్కలనే వున్న చింతలరాయని దేవాలయం దాటారు.

"యిక్కడే వుండాలే, రెండు చోట్లా లేడు!" అన్నాడు క్రిష్ణయ్య.

"యెవరు?" అని పార్థ అడిగే లోపలే యేట్లో కన్పించిన ఆకారాన్ని చూసి "అడుగో" అని సంతోషంతో కేక వేశాడు క్రిష్ణయ్య.

యేట్లో యిసుకలో వొకచోట చిరిగిన దుస్తుల్లో పిచ్చి చూపులూ వెర్రి నవ్వుల వికృతమైన ఆకారాన్ని సమీపించారు యిద్దరూ. ఆ ఆకారంతో "స్వామీ! నమస్కారం. నేను...నేను క్రిష్ణయ్యను," అన్నాడు క్రిష్ణయ్య.

"కృష్ణుడు, అర్జునుడు" అని, ఆ ఆకారం మౌనంలో మునిగిపోయింది.

"పద" అన్నాడు క్రిష్ణయ్య అమితానందంతో.

ఇదంతా పార్థుకు అయోమయంగా వుంది. కొంతదూరం వెళ్ళాక క్రిష్ణయ్య పార్థును కౌగిలించుకున్నంత పనిజేస్తూ—

"యీవాళ మన అదృష్టం పండింది బావా!" అన్నాడు.

"యెట్లా?" అన్నాడు పార్థు అమాయకంగా.

"నేనింతకుముందు చెప్పినానే, అపవాదసూత్రాలను పరిష్కరించేది అతీత శక్తులేనని. ఆయన్ని యిక్కడి వాళ్ళంతా మట్కాస్వామి అంటారు, ఆయన యేవో 'మిస్టిక్ సింబల్స్'లో మాట్లాడతాడు. లేదా బండతిట్లు తిడతాడు. తిట్లు తిన్నవాడు ఆ రోజు అదృష్టవంతుడు. ఏ పని పట్టుకున్నా డబ్బే. ఒకమారు యేమైందనుకున్నావు? ఈ వూళ్ళో జానీ బాషా అనే లారీఓనరు స్వామి దగ్గరకు పోయినాడు. 'పోరా! పంది నాకొడుకా' అని తిట్టాడట: 'ఏం తిట్టు తిట్టినా ఫరవాలేదు. రోజూ మసీదుకు వెళ్ళేవాడిని యింతపాడు తిట్టుతిట్టటమా' అని స్వామిని బయటకు తిట్టి. మట్కాలో రెండువేలు కట్టినాడు. షవరమైంది. కానీ జానీబాషా వెంట వుండే అమాలి కాశింసాయిబు భక్తిగా ఆలోచన చేస్తూ వస్తూంటే ఒక పంది, ఐదు పందిపిల్లలు ఎదురు వచ్చాయంట! అంతే 'వోపెనింగ్'1, 'క్లోజింగ్' 5, 'బ్రాకెట్' 15 తట్టింది. నానా అవస్థలూ పడి బోకి, తపేలా కుదవబెట్టి మూడువందలు కడితే యిరవైనాలుగువేలు కండ్ల జూసినాడు. జానీబాషా కుయ్యోమొర్రో అని మొత్తుకున్నాడు. యింకా యిల్లాంటివి చాలా వున్నాయిలే. మొన్న నాకు నలభైవేలు వచ్చింది, స్వామి చలవవల్లనే. యివన్నీ మరొక మారు చెప్పుతాలే. కాని స్వామితో చిక్కు వుంది. ఆయన మామూలుగా మనుషుల్తో మాట్లాడడు. సాధారణంగా రామలింగేశ్వరస్వామి గుడి దగ్గర పరశురాముడు తపస్సు చేసిన చోట్లో వుంటాడు. లేకపోతే చింతలరాయని గుడిగోపురంకాడ. యెప్పుడూ యోగంలో వుంటాడు. ఈ దినం మన తడాఖా చూడు."

—క్రిష్ణయ్య ఆవేశం పార్థుకు ఒక ముక్కా అర్థంకాలేదు.

"యింతకూ ఆ పిచ్చివాడు," అనబోయి తమాయించుకొంటూ—

"యింతకూ ఆయన అన్న మాటకు అర్థం?" అన్నాడు.

"కృష్టుడు యెన్నోవాడు?"

"అష్టమ గర్భంకదా? ఎనిమిదోవాడు."

"అర్జునుడు?"

"మూడో వాడేనని నేను విన్నది."

"అంటే 83 'బ్రాకెట్టు' గ్యారంటీ అన్న మాట. 'చార్టు' చూడు. ఆ 'రన్ను' వుంది."

క్రిష్ణయ్య జేబులోంచి 'చార్టు' తీసి 'రన్ను' చూశాడు.

"మరి యివాళ 38 'రన్ను' వుందే?" అన్నాడు పార్థు మరోరకంగా 'చార్టు' అంకెలు చూపిస్తూ.

"అంటే దాని 'ఆపోజిట్టే' కదా? నువ్వు తీసిన 38 అపవాదం నెంబరు?"

పార్థుకు అంత సులభంగా నమ్మకం కుదరలేదు. 'మన పేర్లూ ఒక రకంగా అవే కదా! యాదృచ్ఛికంగా వాటిని అన్నాడేమో?" అని అనాలని పార్థు నోరు తెరిచేంతలో క్రిష్ణయ్య:

"అనుమానాలు కొంప ముంచుతాయి. ఆయన యెవరనుకున్నావు? పరమయోగి" అన్నాడు.

పార్థు సందేహాన్ని దిగమింగుకుంటూ అడిగాడు:

"ఏ వూరో?"

"యెవరికి తెలుసు? నెలదినాల నుంచి కన్పిస్తున్నాడు. రాత్రిళ్ళు మాయమవుతాడని కూడా అంటారు జనం...పద పద, టైం అవుతూవుంది..."

క్రిష్ణయ్య తొందర చేశాడు. పార్థు తలకాయ గజిబిజిగా తయారయింది. తాము యెక్కడ తేలేట్లు అని ప్రశ్నించుకున్నాడు.

మట్కా కంపెనీ దగ్గర సంరంభం, క్రిష్ణయ్య బావకు అక్కడ వున్న గౌరవం చూసి పార్థు 'నాయన చెప్పినట్లు బావ ఎంతైనా ప్రయోజకుడే' అనుకున్నాడు. క్రిష్ణయ్యబావ రెండువేలు 83 నెంబరుకే కట్టాడు. పార్థు సందేహంగా, భయంగా వెంటతెచ్చుకున్న రెండువందల్లో ఒక వంద 83 కి కట్టాడు.

రాత్రి యింట్లో బావ బలవంతం మీద చెల్లెలే వడ్డిస్తే, ఆశ్చర్యపోతూ కొంచెం విస్కీ పుచ్చుకొని, విందు భోంచేసి బావతోపాటు తొమ్మిదిగంటలకు మట్కా కంపెనీ చేరాడు పార్థు. 'వోపెనింగ్' ఎనిమిది వచ్చిందని తెలిసి పార్థుకు దిమ్మ తిరిగిపోయింది. 'క్లోజింగ్' మూడు వస్తుంది, రాదు అని మనసులో తలచుకుంటూ వుంటే క్రిష్ణయ్య బావమరిదిని సగర్వంగా చూశాడు.

బావకు వుదయానికల్లా లక్షా అరవై వేలు, తనకు ముష్టి ఎనిమిదివేలు అనుకున్నాడు, అయినా చూడాలి. పార్థు సందేహం చావలేదు.

"సినిమాకు వెళ్ళి మధ్యలో వచ్చేద్దాం," అన్నాడు క్రిష్ణయ్య.

పార్థుకు సినిమా యేమీ తలకెక్కలేదు.

పండ్రెండు గంటల ప్రాంతంలో సినిమానుంచి బయటపడి కంపెనీ దగ్గర కూచున్నారు. ఆ లోపలే క్రిష్ణయ్య మరొక 'క్వార్టరు' పుచ్చుకున్నాడు.

పార్థు భయం, భయంగా బావను చూస్తూ, అక్కడి సందడి వింటూ, బెంచిమీద కూచుని రెండు ప్యాకెట్లు సిగరెట్లు వూదివేశాడు. 'జీరో అవర్'కు సరిగ్గా 'క్లోజింగ్' నెంబరు వచ్చింది. మూడు 'క్లోజింగ్' !

క్రిష్ణయ్య ఆనందానికి హద్దులు లేవు. పార్థు విచారానికి అవధులు లేవు.

"మట్కాస్వామిని రేపు మళ్ళీ చూద్దాం బావా!" అన్నాడు పార్థు.

"సరే బావా!" అన్నాడు క్రిష్ణయ్య.

మర్నాడు వుదయం స్వామి యెక్కడా కన్పించకపోవటం చూసి క్రిష్ణయ్య కంటే కూడా పార్థు హతాశుడయ్యాడు. 'ఈవాళ యేం 'రన్ను'వుందో' నని చార్టు చూద్దామనుకునేంతలో ఆదివారం అని జ్ఞాపకం వచ్చింది. వూళ్ళో ప్రయత్నం చేద్దాం లెమ్మని పార్థు వూరు చేరాడు.

పార్థు చాటుమాటుగా పదివేలు పోగొట్టుకున్నాడు. వానలు పడీపడీ వచ్చిన పచ్చికరువుకు తోడు, అంత డబ్బు వడ్డీలకు తెచ్చిన కొడుకును చూసి తండ్రి లబోదిబోమని మొత్తుకున్నాడు. వుద్యోగమూ లేక, పనిపాటలకూ పనికిరాక, పిల్లను యిచ్చేవాళ్లూ లేక, మైనరు తీరిందనే ధైర్యంతో అప్పులు చేసిన కొడుకును 'నువ్వు నా కొడుకువే కాద'న్నాడు. యెవరూ అప్పులు యిక యిచ్చేదానికి లేదని, ఆస్తి పంపకాలు పెట్టాడు.

పార్థు విషాదయోగంలో కూరుకొనిపోయిన రోజుల్లో దిక్కుతోచక చెన్న కేశవులు వద్దకు వెళ్ళి గోడు చెప్పుకున్నాడు.

చెన్నకేశవులు బాధపడుతూ చెప్పాడు :

"చదువుకున్న వాళ్ళం, అందులోనూ సైన్సువాళ్ళం. మనమైనా కొంత ఆలోచించకపోతే యెట్లా ? నిన్ను తప్పులు పడుతున్నానని అనుకోకు. యింత మంది మట్కా నిప్పుల గుండంలో యెందుకు నడుస్తున్నారంటావు-పీర్లపండగలో నడిచినట్లు? యేదో మారుగుతుందని ఆశ. యెట్లా మారుగుతుంది - ఈ వ్యవస్థే మనుషుల్ని తగలబెట్టే నిప్పులగుండం అయితే? మనకు వుద్యోగాలు ఎట్లాగూ యిప్పట్లో రావు. వచ్చినా బ్రతుకు మారుతుంది అనుకోకు. ఆలోచించవలసింది అదృష్టంమీద ఆధారపడని బతుకు కోసం."

పార్థు మొదటిసారిగా చెన్నకేశవుల ఆవేదనను అర్థం చేసుకోవటానికి ప్రయత్నం చేశాడు.

అంతలోనే చెల్లెలు వద్దనుంచి వుత్తరం వచ్చింది - 'బావకు పిచ్చి పట్టింది, వెంటనే రమ్మ'ని. తాడిపత్రికి వెళ్ళివచ్చిన మట్కా ప్రియుడొకడు వివరాలతో వార్త తెచ్చాడు. ఆ వార్త ప్రకారం క్రిష్ణయ్య మట్కాలో వచ్చింది చాల్లేదనుకొని యేకంగా మట్కాకంపెనీ తెరిచి డబ్బంతా పెట్టుబడి పెట్టాడు. తన తెలివి ప్రయోగించి కొన్ని నెంబర్ల మీద వేలు వేలు 'లోడు' వచ్చినా అవి రావని

నిరూపించుకుంటూ 'లోడు' పైకి పంపలేదు. ఆ నెంబర్లు రావడం, బొంబాయికి బాధ్యత లేకపోవటంతో బాకీలు పడి మట్కా కంపెనీ యెత్తిపోవటం జరిగింది. తాగుడు విపరీతమైంది. అప్పులూ, తాగుడుతో పిచ్చి పట్టింది. వుద్యోగం కూడా వూడవచ్చు.

పార్థుతో సహా యింట్లో అందరూ మొత్తుకుంటూ తాడిపత్రి చేరారు. క్రిష్ణయ్య యింట్లోంచి పారిపోయాడు. 'అదుగో యిక్కడ చూశాం, అక్కడ చూశాం' అని చెబుతూంటే నలుపురూ క్రిష్ణయ్య కోసం రోడ్లమీద పడ్డారు.

పార్థుకు యాదృచ్ఛికంగా మట్కా స్వామిని కలుసుకున్న ప్రాంతాలు మనసులో మెదిలాయి. బావ అక్కడ వుంటాడేమో అనుకుంటూ అటువైపు భయం భయంగా వెళ్ళాడు.

సరిగ్గా మట్కాస్వామిని - బావ చెప్పిన పరమయోగిని - తాము కలుసుకున్న చోటే యెవరో దిగబంరంగా, వికృతంగా కేకలు వేస్తున్నారు. పార్థు భయంతో వణికిపోయాడు. వెనక్కి వెళ్ళి నలుపురినీ పిలుచుకొనివచ్చి క్రిష్ణయ్యబావ అవునో కాదో విచారిద్దామనుకున్నాడు. కాని తెగించి వొక్కడే ముందుకు వెళ్ళాడు.

యెదురుగా క్రిష్ణయ్య! కేకలువేస్తూ క్రిష్ణయ్య బావ!!

"వొరేయ్! యెవడ్రా నువ్వు? చూడరా మట్కా తేజస్సు వంటి నా దివ్య రూపం. నీ కళ్ళతో నువ్వు నన్ను చూళ్ళేవు, నీకు దివ్యదృష్టి యిస్తున్నా, చూడు. నేనే బొంబాయి మట్కాను. నేనే బెజవాడ మట్కాను. చూడరా అగ్గిలో మిడతలు బడినట్లు జనమంతా నా నోట్లోకి పరుగెత్తుతున్నారు. యిదుగో చూడు, వీళ్ళ నెత్తురు నాకుతున్నాను. 'వోపనింగ్', 'క్లోజింగ్', నమ్మకమైన వ్యాపారం. 'వోపెన్డ్' పెద్ద లోడు... పెట్టుబడి 'క్లోజ్డ్'... చింతలరాయా! రామలింగేశ్వరా!! మట్కా స్వామీ!!! నేనే మట్కా స్వామిని...?"

క్రిష్ణయ్యబావ చేతులాడిస్తూ, కాళ్ళు తపతప ఇసుకలో కొడుతూ చింత నిప్పులవంటి కళ్ళతో, తెరుచుకున్న నోటితో, చాచిన నాల్కతో...

పార్థుకు మొదటిసారిగా విశ్వరూప సందర్శనమయింది!

కర్తవ్యం తెలిని విశ్వరూపం అది.

యిప్పుడు చెన్నకేశవులు మాటలు మాత్రమే పార్థు మనసులో పనిచేస్తున్నాయి. ●

○ నవంబరు 1978, స్వాతి మాసపత్రిక.
కన్నడ అనువాద ముద్రణ : 8 జులై 1979, కన్నడప్రభ..
ఇంగ్లీషు అనువాద ముద్రణ : అక్టోబరు-డిసెంబరు 1982, త్రివేణి.
బెంగాలీ అనువాద ముద్రణ : 198౭, దసరా ప్రత్యేక సంచిక, ఆనందబజారు